

## ₹951.46 కోట్లు

సీబీఐకి ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపు స్వల్పంగా తగ్గింది. గత ఏడాది *968.86 కోట్లను కేటాయించగా, ఈ సారి 951.46 కోట్లను ఇచ్చారు.*




పేదల వ్యతిరేక బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది రాజకీయ పక్షపాతంతో కూడిన బడ్జెట్. రాష్ట్రాల ప్రయోజనాలను విస్మరించిన మోదీ సర్కారు.. ఎన్డీఏ భాగస్వాములను సంతృప్తిపరిచేలా ఈ బడ్జెట్‌ను రూపొందించింది. - మమతా బెనర్జీ, బెంగాల్ సీఎం



### టెలికం శాఖకు 1.28 లక్షల కోట్లు


న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో వివిధ టెలికం ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ సంస్థలకు రూ.1.28 లక్షల కోట్లు కేటాయించగా, అందులో బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కే లక్ష కోట్లకుపైగా ఇవ్వనున్నారు. అందులో బీఎస్ఎన్ఎల్ ఆధునీకరణ, పునర్నిర్మాణానికి 82,916 కోట్లు వెచ్చిస్తారు. అలాగే టెలికం గేర్ తయారీ రంగానికి ప్రోత్సాహాన్ని అందించేందుకు మదర్ బోర్డులు (ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు) దిగుమతుల సుంకాన్ని ఐదు శాతం పెంచాలని నిర్ణయించింది. దేశవాళీగా టెలికం పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు అసెంబ్లీపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 నుంచి 15 శాతానికి పెంచింది. న్యూక్లియర్ ఎనర్జీ, రక్ష ణ, అంతరిక్ష, టెలికం, ఎలక్ట్రానిక్స్ రంగాలలో వినియోగిం చే లిథియం, కాపర్, కోబాల్ట్, 25 రకాల ఖనిజాలపై కస్టమ్స్ సుంకం నుంచి పూర్తి మినహాయింపు ప్రకటించింది.

### సామాజిక న్యాయ శాఖకు రూ.13 వేల కోట్లు

న్యూఢిల్లీ, జూలై 23: ఈసారి కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖకు రూ.13,539 కోట్లు కేటాయించారు. 2023-24 సవరించిన అంచనాల ప్రకారం ఈ శాఖకు కేటాయించిన రూ.9,853.32 కోట్లతో పోలిస్తే ఈ నిధులు 37 శాతం ఎక్కువ. రూ.9,549.98 కోట్లను షెడ్యూల్ కులాల అభివృద్ధి పథకానికి కేటాయించారు. ఇతర వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం రూ.2,150కోట్లను కేటాయించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కార్యాచరణ ప్రణాళికకు రూ.314 కోట్లు, షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్‌కు రూ.38, వెనకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రూ.21 కోట్లు కేటాయించారు.

# ఏపీ, బీహార్‌ల బడ్జెట్!

- టీడీపీ, జేడీయూ అధికారంలో ఉన్న ఆ రెండు రాష్ట్రాలకే బడ్జెట్‌లో పెద్దపీట
- మిత్రపక్షాలను కాపాడుకునేందుకు మోదీ సర్కారు తాపత్రయం
- విపక్ష రాష్ట్రాలకు మొండిచేయి
- వేతనజీవులకు దక్కని ఊరట
- ఆహార, గ్యాస్, ఎరువుల సబ్సిడీకి కోత
- బంగారం, వెండిపై సుంకం తగ్గింపు




న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్-2024-25ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లో ఎన్నికల ఫలితాల ప్రభావం స్పష్టంగా కనిపించింది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటుకు కీలకంగా ఉన్న టీడీపీ, జేడీయూ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు బడ్జెట్‌లో చాలా ప్రాధాన్యం దక్కింది. మిత్రపక్షాలను కాపాడుకోవాలనే బీజేపీ తాపత్రయం బడ్జెట్‌లో ప్రతిబింబించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలకూ పెద్దపీట వేసిన కేంద్రం.. విపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు మాత్రం మొండిచేయి చూపించింది. తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల పేర్లు కూడా బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ నోటి వెంటి వినపడలేదు. ఇక, ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడానికి ప్రధాన కారణమైన నిరుద్యోగ సమస్యపై పదేండ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం ఎట్టకేలకు దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. ఉద్యోగ కల్పన కోసం బడ్జెట్‌లో కేంద్రం కొత్త పథకాలను ప్రకటించింది.

**కోతలు.. వాతలే**

పెరుగుతున్న నిత్యావసరాల ధరల కట్టడికి మాత్రం ఎలాంటి చర్యలూ కానరాలేదు. పైగా ఆహార, ఎరువులు, వంటగ్యాస్‌పై సబ్సిడీలకు కోత విధించి పేదల నడ్డి విరిచింది కేంద్రం. బంగారం, వెండిపై మాత్రం కస్టమ్స్ డ్యూటీ తగ్గించడంతో పసిడి పరుగులకు బ్రేకులు వేసింది. ఒకవైపు గ్రామీణాభివృద్ధికి, భూసంస్కరణలకు కొంత ప్రాధాన్యత దక్కినా వ్యవసాయ రంగానికి మాత్రం అంతగా ప్రోత్సాహం దక్కలేదు. పాత పథకాలకు అరకొర కేటాయింపులే జరిగాయి. ఉద్యోగ కల్పన కోసం మినహా ఇతర కొత్త పథకాలేవీ లేవు. ఉన్నత విద్యను ప్రోత్సహిస్తామనే మాటలు బడ్జెట్‌లో నిజరూపం దాల్చలేదు. ఉన్నత విద్యాసంస్థల నిధులకు కేంద్రం కోత పెట్టింది. మొత్తంగా అన్ని వర్గాలు ఎంతో ఆశగా ఎదురుచూసిన బడ్జెట్ ఉసూరుమనిపించింది.

**వేతనజీవి ఆశలపై నీళ్లు**

మధ్య తరగతికి ప్రాధాన్యం ఇచ్చినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పినప్పటికీ బడ్జెట్‌లో మాత్రం కనిపించలేదు. కొంత పన్ను వెసులుబాటు కల్పించినా అది కేవలం కొత్త పన్ను విధానంలో ఉన్న వారికి మాత్రమే కావడం వేతనజీవుల ఆశలపై నీళ్లు చల్లింది. అణురంగంలోకి, వ్యవసాయ పరిశోధనల్లోకి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ వర్గాలను సైతం కేంద్ర బడ్జెట్ సంతృప్తి పరచలేదు. బడ్జెట్ ప్రకటనకు ముందు లాభాల్లో ట్రేడయిన సూచీలు బడ్జెట్ ప్రకటన తర్వాత నష్టాల్లోకి వెళ్లాయి. ముద్ర రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచడం చిన్న వ్యాపారులకు కొంత ప్రోత్సహించే అంశం. రక్షణ, ఆరోగ్య రంగాలకు స్వల్పంగా నిధుల కేటాయింపును పెంచింది.

**నిర్మలా సీతారామన్ రికార్డు**

బడ్జెట్ ప్రవేశపెట్టడంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. వరుసగా ఏడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆమె.. సీడీ దేశ్‌ముఖ్ రికార్డును సమం చేశారు. 1951 నుంచి 56 మధ్య వరుసగా ఏడు పర్యాయాలు ఆయన ప్రవేశపెట్టారు. నిర్మలా సీతారామన్ 2019 నుంచి ఆరు పూర్తిస్థాయి బడ్జెట్‌లను, ఒక మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పూర్తిస్థాయి బడ్జెట్‌లనే పరిగణనలోకి తీసుకుంటే ఆరుసార్లు వరుసగా బడ్జెట్ ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ రికార్డును నిర్మలా సమం చేశారు. కాగా, మంగళవారం ఆమె బడ్జెట్ ప్రసంగం 1:25 గంటల పాటు కొనసాగింది.

## అమరావతి నిర్మాణానికి రూ.15,000 కోట్లు

- బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట
- పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా సహకారం
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు
- 'పూర్వోదయ' ప్రాజెక్టులో ఆంధ్రకు చోటు
- పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు



అమరావతి, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాజధాని అమరావతి నిర్మాణం సహా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రం బడ్జెట్‌లో చోటు కల్పించింది. రాష్ట్ర రాజధాని అవసరాన్ని తాము గుర్తించామని, ఇందుకోసం బహుముఖ అభివృద్ధి సంస్థల ద్వారా ప్రత్యేక ఆర్థిక సహకారాన్ని అందిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాజధాని నిర్మాణానికి రూ.15,000 కోట్లు, రానున్న సంవత్సరాల్లో అదనపు నిధులు ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇచ్చేందుకు, ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు.

**పారిశ్రామిక అభివృద్ధికి నిధులు**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి బడ్జెట్‌లో కేంద్రం ప్రాధాన్యతనిచ్చింది. హైదరాబాద్ - బెంగళూరు, విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక కారిడార్‌ల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో పొందుపరిచింది. కొప్పర్తి, ఓర్వకల్లులో పారిశ్రామిక కేంద్రాల అభివృద్ధికి అవసరమైన నీటి వసతులు, విద్యుత్తు, రైల్వే, రోడ్ల నిర్మాణానికు నిధులు మంజూరు చేస్తామని నిర్మలా సీతారమన్ ప్రకటించారు. వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేకంగా కేటాయింపులు చేస్తామని చెప్పారు. తూర్పు రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్రం కొత్తగా ప్రారంభించిన పూర్వోదయ ప్రాజెక్టులోనూ ఆంధ్రప్రదేశ్‌ను భాగం చేసింది.

**కేంద్రానికి కృతజ్ఞతలు: చంద్రబాబు నాయుడు**

**బడ్జెట్‌లో** ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అవసరాలు గుర్తించి, రాజధాని, పోలవరం, పారిశ్రామిక, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినందుకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ ప్రజల పక్షాన కృతజ్ఞతలు' అంటూ ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇక బడ్జెట్ కేటాయింపులపై సంతోషాన్ని వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్.. ఇది ఏపీకి సరికొత్త సూర్యోదయమని, ఏపీ చరిత్రలో ప్రత్యేకమైన రోజు అని పేర్కొన్నారు.


## ధరలు తగ్గేవి.. పెరిగేవి ఇవి

- (స్పెషల్ టాస్క్ బ్యూరో)



**ధరలు తగ్గేవి:** బంగారం, వెండి, ప్లాటినమ్, క్యాన్సర్ ఔషధాలు, మొబైల్స్, మొబైల్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీఏ), మొబైల్ ఛార్జర్లు, రొయ్యలు, చేపల దాణా, లెదర్, ఫుట్‌వేర్, మెడికల్ ఎక్స్-రే యంత్రాల్లో వినియోగించే ఎక్స్‌రే ట్యూబ్లు, ఫ్లాట్ ప్యానల్ డిటెక్టర్లు, మిథలిన్ డైఫినైల్ డైసోసైనెట్, ఆక్సిజన్ ఫ్రీ కూపర్, ఫెర్రో నికెల్, బ్లిస్టర్ కాపర్, నికెల్ కాథోడ్ వంటి పారిశ్రామిక, ఎలక్ట్రానిక్స్ రంగంలో వినియోగించే 25 రకాల అరుదైన ఖనిజాలు, బ్రూడ్‌స్టాక్స్, పాలీచాట్స్ వార్మ్, సోలార్ ప్యానెల్స్.


**ధరలు పెరిగేవి:** టెలికం రంగంలో వినియోగించే పీసీబీఏ పరికరాలు, మదర్‌బోర్డులు, నాన్ బయోడీ గ్రేడబుల్ ప్లాస్టిక్, అమోనియం నైట్రేట్.



## బడ్జెట్ కేటాయింపులు.. దేనికి ఎంత? (రూ. కోట్లలో)



| | |
|---|---|
| మిత్తీలు | 11,62,940 |
| రవాణా | 5,44,128 |
| రక్షణ | 4,54,773 |
| సబ్సిడీలు | 3,81,175 |
| గ్రామీణాభివృద్ధి | 2,65,808 |
| రాష్ట్రాలకు నిధులు | 3,22,787 |
| మొత్తం బడ్జెట్ | 48,20,512 |
| పింఛన్లు | 2,43,296 |
| విద్య | 1,25,638 |
| ఐటీ, టెలికం | 1,16,342 |
| వైద్యం | 89,287 |
| ఫైనాన్స్ | 86,339 |
| విద్యుత్తు | 68,769 |
| పన్నుల నిర్వహణ | 2,03,530 |
| వ్యవసాయం, అనుబంధ రంగాలు | 1,51,851 |
| హోం వ్యవహారాలు | 1,50,983 |
| కేంద్రపాలిత ప్రాంతాలకు నిధులు | 68,660 |
| సామాజిక సంక్షేమం | 56,501 |
| కామర్స్ అండ్ ఇండస్ట్రీ | 47,559 |
| శాస్త్రసాంకేతిక విభాగాలు | 32,736 |
| విదేశాంగ వ్యవహారాలు | 22,155 |
| ప్రణాళిక, గణాంకాలు | 6,291 |
| ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి | 5,900 |
| పట్టణాభివృద్ధి | 82,577 |
| ఇతరాలు | 1,44,477 |




# బీహార్‌కు భారీ కేటాయింపులు

- రహదారులకు రూ.26,000 కోట్లు
- రూ.21,400 కోట్లతో పవర్‌ప్లాంట్
- వరద నివారణకు 11,500 కోట్లు
- గయలో ఇండస్ట్రియల్ కారిడార్
- పర్యాటక కేంద్రంగా నలంద ప్రాంతం
- కొత్త ఎయిర్‌పోర్టులు, వైద్యకాలేజీలు
- బీహార్ రాష్ట్ర బడ్జెట్‌ను తలపించేలా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు



న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో బీహార్ రాష్ట్రంపై బీజేపీ సర్కారు వరాల జల్లు కురిపించింది. బీహార్‌లో అధికారంలో ఉన్న జేడీయూ ఎంపీల మద్దతుపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్రానికి నిధుల వరద పారించింది. తెలంగాణ సహా అనేక రాష్ట్రాల పేర్ల ప్రస్తావన కూడా లేని బడ్జెట్‌లో బీహార్‌కు మాత్రం కేటాయింపుల్లో కేంద్రం ప్రాధాన్యతను ఇచ్చింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఈ రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులు కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి తన రాష్ట్రానికి భారీగా నిధులు తీసుకురావడంలో జేడీయూ అధినేత నితీశ్ కుమార్ విజయవంతమయ్యారు.

**సంతోషంగా ఉన్నా: నితీశ్ కుమార్**

కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు ప్రాధాన్యం ఇవ్వడంపై బీహార్ సీఎం నితీశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బీహార్ అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. 'మేము బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం. కానీ, సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. అయితే, కేంద్రం నుంచి ఇవాళ మరో మార్గంలో బీహార్‌కు ప్రత్యేక సహకారం అందింది.' అని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపుల పట్ల తాను సంతోషంగా ఉన్నానని అన్నారు.

**రోడ్లకు రూ.26,000 కోట్లు**

బీహార్‌లో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులను కేటాయించింది. పట్నా - పుర్ణియా, బక్సర్ - భాగల్‌పూర్ జాతీయ రహదారులు, బోధ్‌గయా - రాజ్‌గిర్ - వైశాలి - దర్భంగ ఎక్స్‌ప్రెస్‌వే, బక్సర్ వద్ద గంగానదిపై కొత్తగా రెండు లేన్ల వంతెన నిర్మాణం వంటి పనులకు బడ్జెట్‌లో ఏకంగా రూ.26,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

**21,400 కోట్లతో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం**

బీహార్‌లో వరద నివారణ పనుల కోసం రూ.11,500 కోట్లు కేటాయిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ నిధులతో బ్యారేజీలు, నదుల్లో కాలుష్య నివారణ పనులు, నీటిపారుదల ప్రాజెక్టులను చేపట్టనుంది. రాష్ట్రంలో పీర్‌పైంటిలో 2400 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణానికి రూ.21,400 కోట్లు కేటాయించారు.

**ప్రపంచ స్థాయికి విష్ణుపాద్, మహాబోధి ఆలయాలు**

బీహార్‌లోని విష్ణుపాద్, మహాబోధి ఆలయాలను ప్రపంచ స్థాయి తీర్థయాత్ర, పర్యాటక గమ్య స్థానాలుగా తీర్చిదిద్దుతామని నిర్మల పేర్కొన్నారు. విష్ణుపాద్ ఆలయం ప్రాచీన హిందూ ఆలయం కాగా, బౌద్ధ మతానికి చెందిన మహాబోధి ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు పొందింది. ఈ రెండు ఆలయాల కారిడార్లను కాశీ విశ్వనాథ్ ఆలయ కారిడార్ తరహాలో అభివృద్ధి చేస్తామని నిర్మల తెలిపారు. ఇవే కాకుండా రాష్ట్రంలో కొత్తగా ఎయిర్‌పోర్టులు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను సైతం కల్పించనున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. బీహార్ అభివృద్ధికి వివిధ అభివృద్ధి సంస్థల నుంచి ఆర్థిక సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

**బీహార్ ప్రజలను అవమానించొద్దు: తేజస్వీ**

బీహార్‌కు కేటాయింపులపై ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణంగా ఇచ్చే కేటాయింపులనే అసాధారణంగా చూపించి బీహార్ ప్రజలను అవమానించొద్దని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా డిమాండ్ నుంచి ఒక్క అంగుళం కూడా వెనక్కు తగ్గబోమని ఆయన స్పష్టం చేశారు.



### పసిడిపై సుంకం తగ్గింపు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): బంగారం, వజ్రాలు, ప్లాటినమ్ వంటి ఖరీదైన ఆభరణాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తగ్గించాలన్న డిమాండ్‌తో కేంద్రం ఎట్టకేలకు ఆ దిశగా చర్యలు చేపట్టింది. బంగారం, వెండి వస్తువులు, కడ్డీలపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. ప్లాటినమ్, పల్లాడియమ్, ఓస్మియుమ్, రుథేనియం, ఇరీడియంపై 15.4 శాతం ఉన్న సుంకాన్ని 6.4 శాతానికి కుదించింది. మొబైల్స్, ఛార్జర్లపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతానికి తగ్గించడంతో వాటి ధరలు కూడా తగ్గనున్నాయి.



### క్యాన్సర్ రోగులకు శుభవార్త

తగ్గనున్న మూడు ఔషధ ధరలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో), హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మూడు కీలకమైన ఔషధాలు ట్రాస్టుజుమాబ్ డెరాక్స్‌టెకన్, ఓసిమెర్టినిబ్, డుర్వాలుమాబ్‌పై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం పూర్తిగా ఎత్తివేసింది. వీటిపై గతంలో కస్టమ్స్ సుంకం 10 శాతంగా ఉండగా, తాజాగా దాన్ని సున్నాకు స్థిరీకరించారు. అలాగే మెడికల్ ఎక్స్-రే యంత్రాల్లో వినియోగించే ఎక్స్‌రే ట్యూబ్లు, ఫ్లాట్ ప్యానల్ డిటెక్టర్లపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని కుదించారు.

## భూములకు ఆధార్ నంబర్

### పట్టణ భూ రికార్డుల డిజిటలైజేషన్



న్యూఢిల్లీ, జూలై 23: గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు విశిష్ఠ గుర్తింపు నంబర్ లేదా 'భూ-ఆధార్' నంబర్ కేటాయిస్తామని, పట్టణ ప్రాంతాల్లోని భూమి రికార్డులను డిజిటలైజేషన్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పలు భూ సంస్కరణలను ప్రతిపాదించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ భూ సంస్కరణలను అమలు చేసేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. వచ్చే మూడేండ్లలో ఈ సంస్కరణలను పూర్తి చేయడంలో రాష్ట్రాలను ప్రోత్సహించడానికి ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేపట్టబోయే సంస్కరణల్లో 1. భూ యాజమాన్యం, ప్రణాళిక, నిర్వహణ, (2) పట్టణ ప్రణాళిక, వినియోగం, భవన నిర్మాణాలకు నిబంధనలు ఉంటాయి. వీటి అమలుకు రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందజేస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు 'యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఎల్‌పీఐఎన్) లేదా భూ-ఆధార్ నంబర్ కేటాయిస్తామని తెలిపారు. పన్ను విధింపునకు అర్హమైన (కెడస్ట్రల్) భూముల డిజిటలైజేషన్, ప్రస్తుత యాజమాన్యం ప్రకారం మ్యాప్ సబ్ డివిజన్ల సర్వే, ల్యాండ్ రిజిస్ట్రీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. సంస్కరణల్లో భాగంగా రుణ వసతి, వ్యవసాయ సంబంధిత సేవలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఇక పట్టణ ప్రాంతాల్లో జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా ల్యాండ్ రికార్డులను డిజిటలైజ్ చేస్తామని తెలిపారు. ఆస్తుల వివరాల నిర్వహణ, ఉన్నతీకరణ, పన్ను యాజమాన్యానికి సంబంధించి ఐటీ ఆధారిత వ్యవస్థను ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక పురోభివృద్ధికి దోహదం చేస్తామని చెప్పారు.



### 12 ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 23: తయారీ రంగానికి మరింత ఊతమిచ్చేలా దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేయనున్నట్టు కేంద్రం కొత్త బడ్జెట్‌లో ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం భాగస్వామ్యంతో 100 నగరాల లోపల లేదా సమీపాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయన్నుట్టు తెలిపింది. టౌన్ ప్లానింగ్ స్కీమ్‌ల ద్వారా ఈ పార్కులను మెరుగ్గా అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు. దీని ద్వారా పెట్టుబడులు విరివిగా వస్తాయన్నారు.



### ఢిల్లీకి కేంద్రం మళ్లీ ద్రోహం

మాది దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రం. ప్రతి ఏటా రూ.2 లక్షల కోట్లు ఆదాయపు పన్ను కింద, 25 వేల కోట్లు సెంట్రల్ జీఎస్టీ కింద కడుతున్నాం. రూ.2.32 లక్షల కోట్లు కేంద్రానికి ఇస్తున్న మేము బడ్జెట్‌లో కేవలం 0.4 శాతమైన 20 వేల కోట్లు కేటాయించమని అడిగాం. కానీ వారు అదనంగా ఎలాంటి నిధులు ఇవ్వలేదు. ఈ 11 ఏండ్ల కాలంలో మోదీ ప్రభుత్వం ఢిల్లీకి చేసిందేమీ లేదు. చేసినట్టు మీరు నిరూపించగలరా? ఈ బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం మరోసారి వివక్ష ప్రదర్శించింది.

-ఢిల్లీ మంత్రి ఆతిశీ